క్లుప్తంగా

నేడు అయ్యప్పస్వామి మహాపడిపూజ

దాచేపల్లి : నారాయణపురం బ్రహ్మనాయుడు ఆడిటోరియంలో బుధవారం అయ్యప్పస్వామి మహా పడిపూజకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయ్యప్పస్వామి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ మహాపడి పూజను నిర్వహిస్తున్నారు. పి.వి.వి శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో నవవిధ అభిషేకాలు జరుగుతాయని, అయ్యప్పస్వామి భక్తులు ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నాలని అయ్యప్ప సేవా సమితి సభ్యులు కోరారు.

నేడు సింగరాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

మాచవరం: మండలంలోని సింగరాయపాలెం తండా గ్రామంలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొంటారని, గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



దాచేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు అండగా ఉన్నారని సర్పంచ్ కూసం నాగిరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనగర్ గ్రామంలో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా బ్యాంక్ ఖాతాల్లో నగదు జమకావడంతో సీఎం చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగిరెడ్డి మాట్లాడుతూ...చరిత్రలో నిలిచేలా సీఎం జగన్ డ్వాక్రా మహిళలకు లబ్ధి చేస్తున్నారన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని సర్పంచ్ నాగిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకూరి కాశీరెడ్డి, వీవోఏ సుమతీ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కారెంపూడికి అవార్డు



కారెంపూడి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల్లో మెరుగైన ఫలితాలు సాధించినందుకు గాను కారెంపూడి మండలానికి ఉత్తమ అవార్డు దక్కింది. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి చేతుల మీదగా మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ జి శ్రీనివాసరెడ్డి అవార్డును స్వీకరించారు. పల్నాడు జిల్లా కేంద్రం నర్సరావుపేటలో జిల్లా తొలి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఈ అవార్డును కలెక్టర్ బహూకరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పిడుగురాళ్ల: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని కళ్లం టౌన్ షిప్‌లో ధర్మక్షేత్ర అపార్టుమెంట్ వెనుక వైపు రైల్వే ట్రాక్ సమీపంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ కథనం మేరకు మెదక్ జిల్లాకు చెందిన వ్యక్తి సుమారు 10 రోజుల క్రితం రైల్వే ట్రాక్ పక్కనే చనిపోయి ఉన్నాడు. త్వరలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ మీదుగా వెళ్తుండగా రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న ఏపుగా పెరిగిన చెట్లను తొలగిస్తున్నారు. ఈక్రమంలోనే చెట్టుకు ఉరివేసుకొని కుళ్లిపోయిన మృతదేహం రైల్వే గ్యాంగ్ మెన్‌కు కనిపించడంతో సమాచారం మేరకు ఘటనా స్థలాన్నికి వెళ్లి పరీక్షించడం జరిగిందన్నారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని, షర్టు కాలర్‌పై టైలర్ పేరు ఉండడంతో ఆ పేరు ఆధారంగా మెదక్ జిల్లా అని గుర్తించటం జరిగిందన్నారు. ఈ మృతదేహం వయస్సుసుమారు 40 సంవత్సరాలు ఉండవచ్చునని తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ పేర్కొన్నారు.

రైలుకు బోగీలు పెంచాలని వినతి



మాచర్ల: మాచర్ల నుంచి గుంటూరు వెళ్లే రైలులో పెట్టెలు పెంచాలని, ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పట్టణానికి చెందిన చిన్నదాసు రైల్వే స్టేషన్ మాస్టారు వెంకటేశ్వర్లును మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. నిరంతరం ప్రయాణీకులు అధిక సంఖ్యలో గుంటూరు వెళుతున్నారని, వీరందరికి ప్రస్తుత రైలు సౌకర్యంగా లేదని, పూర్తి సౌకర్యాలతో ఉన్న రైలులో భోగీలు ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేశారు.



కలెక్టరేట్‌లో పౌరసంబంధాల శాఖ ఏర్పాటుచేసిన చాయాచిత్రప్రదర్శనశాలలో ఫొటోలను తిలకిస్తున్న మంత్రులు కారుమూరి, అంబటి, జిల్లా కలెక్టర్ శివశంకర్



నవోదయం కింద మంజూరైన వాహనాన్ని రిబ్బన్ కట్ చేసి ఆరంభిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, పక్కన మంత్రి కారుమూరి, కలెక్టర్ శివశంకర్, తదితరులు



కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటుచేసిన ఫుడ్‌కోర్టును ప్రారంభిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ఏడాది పండుగ

పల్నాడు జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్‌లో మంగళవారం ప్రథమ వార్షికోత్సవ సభ జరిగింది. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్‌లు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, పాడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, కలెక్టర్ శివశంకర్ లోతేటి, జేసీ శ్యాంప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. -సాక్షి, నరసరావుపేట

జగనన్నే మన భవిష్యత్తు పోస్టర్ల విడుదల

వెల్దుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మన భవిష్యత్తు, జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సైనికుల్లాగా పనిచేసి విజయవంతం చేయాలని ఎంపీపీ చింతా శివరామయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని గొట్టిపాళ్ళ, గంగలకుంట, శిరిగిరిపాడు, మిట్టమీదిపల్లెలలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ సుపరిపాలనను ప్రతి ఒక్క ఇంటికి తీసుకెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే బాధ్యత గృహ సారధులు, వలంటీర్లుతో పాటు గ్రామ నాయకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గృహ సారధులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాల్సిన బాధ్యత ఉందన్నారు. సంక్షేమ పథకాలు రానివారుంటే వారిని గుర్తించి, వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహసారధుల మండల కన్వీనర్ బొజ్జా అంజిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అలుగుమల్లి సంజీవరెడ్డి, గట్లా బ్రహ్మరెడ్డి సర్పంచ్‌లు కాయకొకుల రామాంజి, కంపసాటి కాటంరాజు, చపారపు సంజీవమ్మ, అంబటి అంకిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సబ్బసాని కోటిరెడ్డి, చింతా ఆదినారాయణ, ఎంపీటీసీ బాలునాయక్, మాజీ సర్పంచ్ వీరయ్య, అశోక్ తదితరులున్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న పార్టీ నేతలు



పాల్గొన్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, కన్వీనరు



మాట్లాడుతున్న జేసీఎస్ మాచర్ల మండల ఇన్‌చార్జి శేరెడ్డి వీరారెడ్డి

'జగనన్నే మా భవిష్యత్తు'పై అవగాహన

మాచర్ల రూరల్: అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కలిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పరిపాలనలో మన భవిష్యత్తు జగనన్నేనని చాటిచెప్పాలని ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లిలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న సుపరిపాలనను ప్రతి ఒక్క ఇంటికి తీసుకెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే బాధ్యత గృహ సారధులు, వలంటీర్లుతో పాటు గ్రామ నాయకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. గృహసారధుల మండల కన్వీనర్ శేరెడ్డి వీరారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, నాయకులు దశబందపు కొండలు, హనిమిరెడ్డి, గాలి బాలిరెడ్డి, కోటిరెడ్డి, జయభారత్‌రెడ్డి, పున్నారెడ్డి తదితరులున్నారు.

విస్తృతంగా ప్రచారం చేయాలి

విజయపురిసౌత్: ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని జెసీఎస్ మాచర్ల మండల ఇన్‌చార్జి శేరెడ్డి వీరారెడ్డి కోరారు. మంగళవారం మాచర్ల మండలంలోని నాగులవరం, కొత్తూరు, పశువేముల సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, గృహ సారధులు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల ఎంపీపీ బూడిద శ్రీను, వైస్ ఎంపీపీ పోతిరెడ్డి కోటిరెడ్డి, సర్పంచ్‌లు మద్దిగపు అచ్చిరెడ్డి, కర్రా చిన రంగయ్య, గోగిరెడ్డి వెంకట్రావమ్మ, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు నుంచి జగనన్నే మన భవిష్యత్తు

కారెంపూడి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్ల సమావేశాన్ని మండల కన్వీనర్ అల్లు వెంకటేశ్వరరెడ్డి (యూత్) మంగళవారం సాయంత్రం కారెంపూడి మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు. ఈ నెల ఆరో తేదీ నుంచి జగనన్నే మన భవిష్యత్తు కార్యాక్రమాన్ని ప్రారంభించాలని వెంకటేశ్వరరెడ్డి కోరారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, గ్రామ వలంటీర్లు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని వారికి వివరించాలని కోరారు. వారికి జగనన్న ప్రభుత్వం చేకూర్చిన ప్రతి సంక్షేమ కార్యాక్రమాన్ని వారికి మంచిగా వివరించి వారు ప్రభుత్వానికి మద్దతు తెలిపేలా గడప గడప కార్యక్రమం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అక్బర్,ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, పార్టీ నాయకులు బొమ్మిన అల్లయ్య, యర్రంరెడ్డి వీరారెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కూనిరెడ్డి సైదారెడ్డి, గాడిపర్తి పూర్ణయ్య, దిబ్బమడుగు కృష్ణమూర్తి, ఆళం విజయభాస్కరరెడ్డి, జొన్నలగడ్డ శ్రీను తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

రెంటచింతల: రాష్ట్రంలోనే ఎండలకు పేరు పొందిన రెంటచింతలకు వివిధ పనులపై కోసం పలు గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులకు ,పాదచారులకు దాహార్తిని తీర్చేందుకు ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చి రెంటచింతలలో చలివేంద్రం ఏర్పాటుచే యడం అభినందనీయమని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆంధ్రబ్యాంక్ సమీపంలోని మీ–సేవా కేంద్రం వద్ద ఉమ్మా నాగేంద్రమ్మ, సునోవికా జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రం 50 రోజులపాటు తీవ్రమైన ఎండకు చల్లటి మంచినీటిని పంపిణీ చేసేలా ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ సభ్యులు చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ శౌంతిరెడ్డి నర్శిరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ మద్దిరాల కృష్ణారెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, ఫ్రెండ్స్ ఇన్ నీడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు పేరం చెన్నారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మోర్త ఉమ, పశర్లపాడు బ్రహ్మరెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, చింతా శివారెడ్డి, చల్లామట్టారెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

108లో ప్రసవం



కారెంపూడి: 108లో మహిళ ప్రసవించిన ఘటన మంగళవారం తెల్లవారుజామున నకరికల్లు సమీపంలో చోటుచేసుకుంది. బొల్లాపల్లి మండలం చక్రాయపాలెం తండాకు చెందిన బాణావతు బుజ్జిభాయిని ప్రసవం నిమిత్తం కారెంపూడి 108 అంబులెన్స్‌లో నర్సరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నకరికల్లు వద్ద ఆమెకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో వాహనాన్ని రోడ్డు పక్క నిలిపి ఈఎంటీ కోట రాము, పైలెట్ ఈశ్వర్‌నాయక్ కాన్పు చేయించారు. మగ బిడ్డ పుట్టాడు. ప్రసవం అనంతరం అంబులెన్స్‌లో తల్లీబిడ్డను నర్సరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇదిలా ఉంటే ఆమెకు ఇది నాలుగో కాన్పు. రక్తం తక్కువగా ఉండి బలహీనంగా ఉండడంతో ముందుజాగ్రత్తగా కాన్పు కోసం నర్సరావుపేట తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ఆమె బిడ్డను ప్రసవించారు.

డాబాపై నుంచి పడి యువకుడి మృతి

గురజాల : ప్రమాదవశాత్తు దాబాపై నుంచి పడి యువకుడి మృతిచెందిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గుంటూరు రోడ్డులోని ఎస్వీఆర్ రెస్టారెంటు సమీపంలో బడిదల శ్రీనివాసరావు కాంప్లెక్సు నందు లైటింగ్ డెకరేషన్ కార్మికులు జీవనం సాగిస్తున్నారు. 2వ తేదీ కూలీలు యధావిధిగా అంతస్తుపై నిద్రించారు. తెల్లవారిన తరువాత పశ్చిమ బెంగాలు రాష్ట్రం, నొదియా జిల్లా, సింగదంగ మండలం, పిపుల్ బరియా గ్రామానికి చెందిన బిస్వజిత్ సర్కార్ కనిపించలేదు. తోటి కార్మికులు వెతుకుతుండగా రాత్రి సమయంలో యూరిన్ పోసుకోవడానికి పై అంతస్తుకు వెళ్లగా నిద్రమత్తులో కింద పడి ఉన్న విషయాన్ని గమనించారు. కింద నాపరాళ్లు ఉండడంతో తలభాగంపై దెబ్బ తగలడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహన్ని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మేస్త్రీ ప్రోజిత్ రాంక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లిన వైఎస్సార్ సీపీ నాయకులు

పిడుగురాళ్ల: బైపాస్ త్వరగా పూర్తి కావాలంటూ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు భారీ సంఖ్యలో కలెక్టర్ కార్యాలయానికి తరలి వెళ్లారు. పిడుగురాళ్ల పట్టణానికి ప్రధాన సమస్యగా ఉన్న బైపాస్‌ను వెంటనే పూర్తి చేయాలంటూ నియోజకవర్గంలోని నాయకులంతా పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కాసు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు

ఘనంగా చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

మాచర్ల : పట్టణంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో మంగళవారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంకురార్పణ కార్యక్రమం ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా అర్చకులు శ్రావణకుమార్ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశ స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి కార్యక్రమాన్ని భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపవరపు నాగేశ్వరరావు, ఈఓ సాంబయ్య, కమిటీ సభ్యులు నాసరయ్య, లక్ష్మీ కోటేశ్వరి, వై.కోటయ్య, నాగలక్ష్మి, కోటేశ్వరి, రఘులు బ్రహ్మోత్సవ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా స్వామివారి మూల విరాట్ విగ్రహాన్ని, శ్రీలక్ష్మీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



విద్యుత్ దీపలంకరణలో స్వామివారి ఆలయం

అన్ని వర్గాల అభివృద్ధే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మాచర్ల రూరల్: సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగి అన్ని వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఒక్క విద్య ద్వారానే సాధ్యపడుతుందని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అందరికీ ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్న గొప్ప నేత ఆయనేనని మార్కాపురం ఎమ్మెల్యే కె నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని న్యూటన్స్ గ్రూప్ ఆఫ్ ఇన్సిట్యూట్ వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది ప్రతి ఒక్కరినీ బడికి పంపాలనే లక్ష్యంతో అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా వసతితో పాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్న ఘనత మనదేనన్నారు. ముఖ్యంగా వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో న్యూటన్స్ కళాశాల స్థాపించి ఆధునిక సాంకేతిక విద్యనందించి విద్యార్థులకు అందిస్తూ వారికి దేశ విదేశాలల్లో ఉద్యోగ అవకాశాలతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్న కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, చైర్మన్ కె కృష్ణమోహన్‌రెడ్డిలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, ప్రిన్సిపల్ జగదీష్‌రెడ్డి, డైరెక్టర్ జున్నా పద్మావతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

సమష్టిగా మండలాభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీపీ సునీత సాయిశంకర్

దుర్గి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి మండలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించి మండలాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో మండల సర్వసభ్య సమావేశంలో సునీత సాయిశంకర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో తాగునీరు సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు గ్రామాల్లో సైడు కాల్వలు, సీసీరోడ్లు నిర్మించి అభివృద్ధి చర్యలు చేపట్టామన్నారు. దుర్గి నుంచి జిల్లా కేంద్రమైన నర్సరావుపేటకు ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వ విప్ పిఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు. జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ చేయాల్సిన బాధ్యత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు ఉందన్నారు. సమావేశంలో వివిధ శాఖల మండల అధికారులు తమ శాఖ తరపున చేపట్టిన కార్యక్రమాలను సమావేశంలో వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, ఎంపీటీసీలు కటకం గోపాల్, బొంతా కృష్ణ, షేక్ హుస్సేన్, కోఆప్షన్ మెంబర్ షేక్ జానీ, సర్పంచ్‌లు రామచంద్రయ్య యాదవ్, మండల అధికారులు ఈఓపీఆర్‌డి గుప్తా, సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తమరాజు, ఎఓ శివప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ వెంకటేష్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ యేచూరి సునీత సాయిశంకర్

గంజాయి మొక్కలు నాటింది టీడీపీ వారే !

మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ

గురజాల : గంజాయి మొక్కలు నాటింది తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలేనని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మొక్కలు నాటాల్సిన ఖర్మా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అవసరం లేదని మీకు అవసరం ఉందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పేకాట క్లబ్‌లు, అక్రమమైనింగ్, చిన్నారులపై అఘాయిత్యాలు చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. లేనిపోని ఆరోపణలు చేసి తమపై బురద జల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. ఇకనైనా అధికార పార్టీపై చేస్తున్న ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పాలన అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ కె అన్నారావు, తదితరులున్నారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

మాచర్ల: పూజిత వెల్ఫేర్ సొసైటీ సోషల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో ఆంధ్రాబ్యాంకు ప్రాంతంలో సొసైటీ అధ్యక్షురాలు ఎర్రబోతుల కోటేశ్వరి ఆధ్వర్యంలో 75 మంది మహిళలకు కుట్టుమిషన్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ పీఆర్కే మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ సొసైటీ ద్వారా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. తనవంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, వార్డు కౌన్సిలర్లు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్ అందిస్తున్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

రైతు ఆత్మహత్య



దుర్గి: మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి చెందిన రైతు మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. ముటుకూరు గ్రామంలోని దొండపాటి గణేష్ (35) అనే రైతు తనకున్న మూడు ఎకరాల పొలంతో పాటు 10 ఎకరాలు కౌలుకు తీసుకొని మిర్చి పంటవేశారు. సరైన దిగుబడి రాకపోవడంతో పెట్టుబడికి చేసిన అప్పులు అధికమవ్వడంతో అప్పుల వాళ్ళు అడుగుతుండడంతో తీర్చలేక, వారి ఒత్తిడి తట్టుకోలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహన్ని బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.